క్లుప్తంగా

వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. వేకువజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ద్వారకా ఎస్‌ఐకు బదిలీ

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐ శ్రీనును వన్ టౌన్ ఎస్‌ఐగా బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఆయన 2023 నవంబర్‌లో ద్వారకా ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టారు. సుమారు 16 నెలల పాటు విధులు నిర్వహించారు. శ్రీను స్థానంలో ఎవరినీ నియమించలేదు.

గెడ్డ శుభ్రతకు చర్యలు



పెట్రోల్‌బబంక్ పక్కనున్న గెడ్డలో చెత్త తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులోని గెడ్డను పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేశారు. 'గెడ్డల శుభ్రత పట్టదా..' అనే శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ అధికారులు తక్షణం స్పందించారు. వారి ఆదేశాల మేరకు వార్డు శానటరీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పెట్రోల్ బంక్‌ను ఆనుకుని ఉన్న గెడ్డలోని పూడికను సిబ్బంది తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నార సంచులే మేలు



సీతమ్మధార రైతుబజారులో ప్రచారం చేస్తున్న జీవీఎంసీ అధికారులు

సీతమ్మధార: స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సీతమ్మధార రైతుబజార్‌లో ప్రజలకు, కమర్షియల్ షాపులు, తోపుడుబళ్ల వర్తకులకు, రైతులకు ప్లాస్టిక్ నిషేధంపై స్పెషల్ ఆఫీసర్ పైడిరాజు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు బదులుగా గుడ్డ, నార సంచులు వినియోగించాలని సూచించారు. అనంతరం అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. రైతుబజార్ ఈవో కృష్ణమూర్తి, శానిటేషన్ సెక్రటరీస్, పబ్లిక్ హెల్త్ సిబ్బంది, ఎడ్మిన్ సెక్రటరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కొట్లాటలో ఇద్దరిపై కేసు

సీతమ్మధార: పరస్పర దాడులకు పాల్పడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై ద్వారకా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రామకృష్ణ అనే వ్యక్తి ద్వారకానగర్‌లో బిర్యానీ సెంటర్ నడుపుతున్నాడు. బిర్యానీకి కావాల్సిన చికెన్‌ను హెచ్‌బీ కాలనీకి చెందిన శ్రీనివాస్ ఇస్తుండేవాడు. కొద్ది నెలలుగా లక్ష రూపాయలు శ్రీనివాస్‌కు బకాయి పడటంతో శనివారం బిర్యానీ సెంటర్ వద్దకు వెళ్లి నగదు ఇవ్వాలని నిలదీశాడు. ఇరువురి మధ్య తోపులాట జరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. రామకృష్ణ తండ్రి అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై ద్వారకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం





ఐటీఐ కూడలిలో కప్పరాడ స్కూల్ పరీక్ష కేంద్రం

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

పరీక్ష కేంద్రాల్లో పక్కా ఏర్పాట్లు

ఉత్తమ ఫలితాలే విద్యార్థుల లక్ష్యం

కంచరపాలెం: విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి పరీక్షలకు సమయం ఆసన్నమైంది. ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 1 వరకు పరీక్షలు జరుగుతాయి. ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యార్థులందరూ పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యారు. పరీక్షల నిర్వహణకు విద్యా శాఖాధికారులు సర్వం సిద్ధం చేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. కంచరపాలెం, ఐటీఐ కూడలి, రామ్మూర్తిపంతులుపేట, కప్పరాడ, భాష్యం, శ్రీచైతన్య, రామకృష్ణ ఉన్నత పాఠశాలల్లో టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవోలు, ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు, చీఫ్, డీవోలు తెలిపారు.



ఆర్పీ పేట హైస్కూల్ పరీక్ష కేంద్రం

ముఖ్య విషయాలు

- ఈ నెల 17వ తేదీ సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి.
- పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే విద్యార్థులు చేరుకోవాలి.
- ప్రతి పరీక్ష కేంద్రంలో సుమారు 240 మంది పరీక్ష రాసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.
- స్థానిక పరీక్ష కేంద్రాల్లో సకల సదుపాయాలు కల్పిస్తున్నారు.
- జ్ఞానాపురం సేక్రెడ్‌హార్ట్ బాలికోన్నత పాఠశాల, జూబ్లీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఐటీఐ కూడలిలోని కప్పరాడ ఉన్నత పాఠశాల, కరాసలో స్టెల్లామేరీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఎన్‌ఏడీ కొత్త రోడ్డులో రామకృష్ణ పబ్లిక్ స్కూల్, ఎన్‌ఏడీ శ్రీచైతన్య స్కూల్, ఆర్పీ పేట, కప్పరాడ ఉన్నత పాఠశాలల నుంచి పరీక్షలు రాసేందుకు టెన్త్ విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని ఆర్పీ పేట హైస్కూల్ హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు తెలిపారు.

టెన్త్ పరీక్షలు రాయనున్న విద్యార్థుల సంఖ్య	
ఆర్పీ పేట ఉన్నత పాఠశాల	- 164
కప్పరాడ ఉన్నత పాఠశాల	- 118
జ్ఞానాపురం సేక్రెడ్‌హార్ట్ స్కూల్	- 140



ఆర్పీ పేట హైస్కూల్‌లో టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతున్న తరగతి గది

ముగిసిన గ్లకోమా వారోత్సవాలు



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

తాటిచెట్లపాలెం: ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలు సంయుక్తంగా గ్లకోమాపై అవాగాహన కార్యక్రమం నిర్వహించాయి. రామాటాకీస్ రోడ్డులోని నేత్ర వైద్యశాల నుంచి సత్యం జంక్షన్ వరకు అవగాహన ర్యాలీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ముఖ్య అతిథి ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి మాట్లాడుతూ వారం రోజుల పాటు గ్లకోమాపై అవగాహన కోసం చేపట్టిన కార్యక్రమాలపై జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ మీనాక్షిని ప్రశంసించారు. స్క్రీనింగ్ క్యాంప్‌లు నిర్వహించిన డాక్టర్ సౌజన్య, డాక్టర్ వాణిశ్రీలను అభినందించారు. కార్యక్రమంలో ప్రాంతీయ నేత్ర వైద్యశాల ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిర్మయి, అసోసియేట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ ఎ.వి.రమణ, డాక్టర్ మాధవి, ఇతర వైద్యులు, జూనియర్ వైద్యులు, ఎల్.వి. ప్రసాద్ హాస్పిటల్, గీతం మెడికల్ కాలేజీ సిబ్బంది, విశాఖ ఐ హాస్పిటల్, ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం



చీపురుతో కార్యాలయ ఆవరణను శుభ్రం చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డీమో) ఎం.నాగేశ్వరరావు చీపుర్లతో ఆవరణను శుభ్రం చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం పరిసరాల పరిశుభ్రత కోసం కొంత సమయం కేటాయించాలన్నారు. కార్యాలయంలో టేబుళ్లు, కంప్యూటర్లు, రికార్డులు, కిటికీలు, టాయిలెట్లు, టెరస్‌లను శుభ్రపరిచారు. టెర్రస్, ఆఫీస్ గోడలపైన పెరిగిన మొక్కలను తొలగించారు. ప్రోగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తమ సెక్షన్లతోపాటు పరిసరాలను శుభ్రం చేశారు.

ఆకట్టుకుంటున్న నాటిక ప్రదర్శనలు



పక్కింటి మొగుడు నాటికలోని ఓ సన్నివేశం

మురళీనగర్: కేవీ మెమోరియల్ ఆర్ట్స్, విశాఖ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ సంయుక్త ఆధ్వర్యంలో మురళీనగర్‌లోని వైశాఖి స్పోర్ట్స్ పార్కు వేములపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఆహ్వాన నాటకోత్సవాలు శనివారం కొనసాగాయి. రెండో రోజు నాటికల్లోని పలు నిత్య జీవిత సంఘటనలకు సంబంధించిన సన్నివేశాలు ఆహుతులను ఆలోచింపజేశాయి. ఒంగోలు పండు క్రియేషన్స్ ప్రదర్శించిన పక్కింటి మొగుడు నాటిక ఆకట్టుకుంది. ఇతరుల అవసరాలను ఆసరాగా తీసుకుని బ్లాక్‌మెయిల్ చేయడం మంచిది కాదని, బుద్ధిగా ఉండి ఒకరికి సాయం చేయడానికి ప్రయత్నించాలనే నీతిని ఈ నాటిక ప్రబోధించింది. అనంతరం విశాఖ జాస్మిన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఈవెంట్స్ మహిళా నటులు సంకల్పం నాటిక ప్రదర్శించారు. సంకల్పం తండ్రి రైతు. వ్యవసాయమే ప్రాణం. తండ్రి పక్షవాతం వచ్చి కుంటివాడైపోవడంతో వ్యవసాయం చేయలేక బాధపడతాడు. ఇది గమనించిన అతని కూతురు వ్యసాయం చేసి ఆయన ఆశయాన్ని కొనసాగిస్తుంది. కాలేజీలో అబ్బాయిని లవ్ చేస్తుంది. తన కోరిక తండ్రి వ్యవసాయాన్ని కొనసాగించడానికి ఒప్పుకుంటేనే పెళ్లి చేసుకుంటానని కండిషన్ పెడుతుంది. అనేక మలుపుల తర్వాత ఆ యువకుడు వ్యవసాయాన్ని కొనసాగిస్తాడు. సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమని ఈ నాటికలో సందేశాన్నిచ్చారు. పార్కు అధ్యక్ష, కార్యదర్శులు సనపల వరప్రసాద్, పి.వెంకట సూర్యనారాయణరాజు పర్యవేక్షించారు. చౌదరి అప్పారావు, వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి సహకరించారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న స్వామీజీ స్వసంవేద్యానంద

మురళీనగర్: రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం, జనజాగృతి సాంస్కృతిక సంస్థ సంయుక్తంగా స్వామి వివేకానందుడు రచించిన 'భారత జాతికి నా హితవు' అనే పుస్తకంపై శనివారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థులకు సాహిత్య రచన పోటీ నిర్వహించారు. విద్యార్థుల్లో మంచి వ్యక్తిత్వ నిర్మాణం కోసం యూత్ ఐకాన్ స్వామి వివేకానంద బోధనలను స్మరించుకునేందుకు ఈ పోటీలు ఏర్పాటు చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు పర్యవేక్షణలో జరిగిన పోటీల్లో 343 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 50 ప్రశ్నలతో కూడిన రాత పరీక్షలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. విజేతలకు 'సమగ్ర ప్రామాణిక' పుస్తకం మొదటి , రెండు సంపుటాలను విశాఖలోని రామకృష్ణ మిషన్ స్వామీజీ స్వసంవేద్యానంద చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలు విశ్వమంతటా వ్యాపించాయన్నారు. జనరల్ విభాగాధిపతి డాక్టర్ పి.ఎం.బాషా పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ లెక్చరర్ డాక్టర్ కె.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన కేంద్ర బృందం పర్యటన



డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావుతో భేటీ అయిన కేంద్ర బృందం

మహారాణిపేట: పలు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో సర్వే శనివారంతో ముగిసింది. ఈ నెల 10 నుంచి శనివారం వరకు కేంద్ర పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన కేంద్ర బృంద ప్రతినిధులు డాక్టర్ రమణ, డాక్టర్ పాదాలు నాయకత్వంలో జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణఆరోగ్య కేంద్రాలను పరిశీలించింది.ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డీఎంహెచ్‌వో) కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావుతో బృందం భేటీ అయింది. కేజీహెచ్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రులపై కొన్ని సూచనలు చేసింది. సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖకు చెందిన వివిధ విభాగాల అధికారులు డాక్టర్ బి.ఉమావతి, శాంతిప్రియ, శ్రీనివాస్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, జిల్లా సమన్వయకర్త డాక్టర్ హారిక, జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై కేంద్రం కుట్ర

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



దీక్షాశిబిరాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న బీవీ రాఘవులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగకుండా కుట్ర జరుగుతోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ప్యాకేజీ ఒక మోసమని అభివర్ణించారు. ఈ కుట్రను సమష్టిగా ఎదుర్కొనేందుకు అన్ని రకాల పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ కార్మికుల దీర్ఘకాలిక ప్రయోజనాలు, సంస్థ మనుగడ ముఖ్యమన్నారు. దాన్ని పట్టించుకోకుండా కార్మికులను తరిమేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్త చేశారు. దేశం అగ్రస్థానంలో నిలవాలంటే విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలో కొనసాగాలన్నారు. అందుకు అవసరమైన పోరాటాల్లో సీపీఎం కచ్చితంగా కీలకభూమిక పోషిస్తుందన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి ఐక్య పోరాటాలకు అంతా ముందుకు రావాలి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, శ్రీనివాసరావు, ప్రసాద్, వై.టీ.దాస్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విశాఖ ఉక్కుకు ఊతమివ్వని ప్యాకేజీ అనే పుస్తకాన్ని రాఘవులు ఆవిష్కరించారు.

స్వచ్ఛతే ముద్దు.. ప్లాస్టిక్ వద్దు

- స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో వక్తలు
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విడనాడుతామని ప్రతిజ్ఞ



ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు



51వ వార్డులో ఆలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్నకార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, అధికారులు

మద్రిపాలెం: స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛ విశాఖకు కృషి చేస్తామని, ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరిస్తామని వక్తలు ప్రతిజ్ఞ చేయించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ విడనాడాలని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. అప్పయ్యనగర్‌లోని భూ సమేత విజయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈవో పీఎస్‌ఎన్ మూర్తి, సహాయక కమిషనర్ అన్నపూర్ణతో కలిసి పురోహితులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చుట్టపక్కల చిరువ్యాపారాలు నిర్వహించే వారికి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈస్ట్ పార్కులో వాకర్స్‌తో, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో విద్యార్థులు, వార్డెన్‌లతో, వార్డులో పలు చోట్ల శానిటరీ సిబ్బందితో కలిసి కార్పొరేటర్ వెంకటరమణ ర్యాలీ నిర్వహించి, స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది, సెక్రటరీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకానికి ప్రతి ఒక్కరూ స్వస్తి చెప్పాలని శానిటరీ సిబ్బంది పిలుపునిచ్చారు. జీవీఎంసీ 49వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ త్రిమూర్తులు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ప్రజల నుంచి స్వచ్ఛ సర్వేక్షన్ ఫీడ్‌బ్యాక్‌ను తీసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, సూపర్‌వైజర్ గురుమూర్తి, స్థానికులు పాల్గొన్నారు.



49 వార్డులో అవగాహన కల్పిస్తున్న శానిటరీ సిబ్బంది

రైతుబజార్ పరిశుభ్రత

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజార్‌లో శనివారం వార్డు శానిటేషన్ విభాగం అధికారుల ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను పూర్తిగా తరిమికొట్టాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మహిళా పొదుపు సంఘాల సిబ్బంది, ఆర్పీలు, శానిటేషన్ సెక్రటరీ, జీవీఎంసీ శానిటేషన్ సిబ్బంది, మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నరసింహనగర్ రైతుబజార్‌లో జీవీఎంసీ సిబ్బంది, నాయకులు

పరిసరాల శుభ్రతకు కృషి

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్, సభ్యులు ప్లాస్టిక్ నిషేధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. వారంలో ఒక రోజు పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని నిర్ణయించారు. వాకర్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో 'శక్తి యాప్' రిజిస్ట్రేషన్

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం 'శక్తి యాప్' రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల పాల్గొని శక్తి యాప్‌లో ప్రతి విద్యార్థి రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని, తద్వారా ఎటువంటి అనుకోని, అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ విభాగం ద్వారా సులభంగా బయటపడవచ్చని సూచించారు. ఫోర్త్ టౌన్ ఎస్సై కోనేటి నరసింగరావు మాట్లాడుతూ శక్తి యాప్ మహిళల రక్షణ, భద్రతకు ముఖ్యమైనదని, యాప్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులచే రిజిస్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ ఎస్ అనురాధ, డాక్టర్ విజయ ప్రశంస, డాక్టర్ వరలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ లావణ్య, డాక్టర్ హైమావతి పాల్గొన్నారు.

దృష్టంతా చలానాల పైనే..

ఒకవైపు ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉంటే.. పోలీసులు మాత్రం చలానాలు రాసుకోవడంపైనే దృష్టి పెడుతున్నారు. ఊర్వశి జంక్షన్ ట్రాఫిక్ పద్మవ్యూహంగా మారిపోతే అక్కడున్న ట్రాఫిక్ పోలీసులు మాత్రం హెల్మెట్లు లేని వారికి ఫైన్లు విధించడానికే పరిమితమయ్యారు. ట్రాఫిక్ నియంత్రణను పట్టించుకోకపోవడం గమనార్హం.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం







వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

మద్దిలపాలెం: వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సయుక్తంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ కొనే ప్రతి వస్తువులోనూ లోపం లేకుండా సరైన ధర తూకం కలిగినవి పొందే హక్కు వినియోగదారులకు ఉందన్నారు. కాలుష్య నియంత్రణ, సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన గురించి వివరించారు. గౌరవ అతిథి అంబేడ్కర్ లా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీతామాణిక్యం మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, స్థిరమైన జీవనశైలి ఎలా పెంపొందించుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వినియోగదారుల రక్షణ మండలి సెక్రటరీ లింగేశ్వరరావు మాట్లాడుతూ వినియోగదారుల అవగాహన, రక్షణ మండలి పాత్ర గురించి తెలియజేశారు. వినియోగదారుల రక్షణ మండలి ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర మాట్లాడుతూ మండలి ద్వారా చాలా కేసులు పరిష్కారమయ్యాయన్నారు.